# కుమ్మరి కోటయ్య

**త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరిపించే రోజులు దగ్గర పడ్డాయి.**

**లక్షాధికార్లు, కోటీశ్వరులూ అయిన రెడ్లున్నారు ఊళ్ళో. కానీ, ఆ ఉత్సవాలు జరిపించేపని ఒక్క కుమ్మరికోటయ్య మాత్రమే చెయ్యగలడు.**

**రాములవారి గుడి అరుగు మీద గుమిగూడి కూర్చున్నవాళ్ళలో ఒకడైన జూనియర్ నాజర్ ''వెళ్ళి కుమ్మరికోటయ్యతో మాటాడదామాండీ'' అన్నాడు.**

''రమ్మని ఆదియ్యతో కబురు చేసేను'' అన్నాడు కర్రి మందారెడ్డి.

వాళ్ళలా మాటాడుకుంటుండగానే వెనక్కొచ్చిన ఆదియ్య ''కోటయ్య ఇంట్లో లేడండి. పొద్దుటే డోలు జబ్బకి తగిలించుకుని బయటికెళ్ళిపోయాడంట'' అన్నాడు.

''ఎక్కడుంటాడో పదండి వెతుకుదాం'' అన్నాడు మందుల అప్పన్న.

''చింతావారి తోటలోగానీ ఉంటాడేమో'' అన్నారు పిలరెడ్డిగారు.

''కాదండి నల్లమిల్లి రాజారెడ్డిగారి పొలంలో ఉండొచ్చు'' అన్నాడు మేస్త్రి వీరాస్వామి.

''ముందు కాలవ దగ్గర్నుంచి వెతుక్కుదాం పదండి'' అని పొట్టి సుబ్బిరెడ్డిగారనే సరికి అంతా బయల్దేరేరు.

వాళ్ళలా వెళ్తుంటే దారిలో ఎదురైన మంగలిడాక్టరు (ఆయనకి స్థిరపడ్డ పేరు అది), కర్రి వెంకయ్య రత్నేశ్వర్రావుగారు, బులిరెడ్డి మేష్టారు 'మేమూ వస్తాం పదండి'' అన్నారు.

చెల్లూరు వంతెన దిగువలో ఎర్రమట్టి గోతులు దాకా వెళ్ళారు. ఎక్కడా కోటయ్య జాడ లేదు.

వెనక్కొచ్చి చెల్లూరు వేపెళ్తుంటే బోదికాలవ పక్కన విరగ్గాసిన మావిడికొమ్మలు కాలవలోకి ఒంగిపోతున్నాయి. ముగ్గిన పండు దబ్బుమని పడింది నీళ్ళలో. ఆ తోటంతా కల తిరుగుతున్న వాళ్ళకి ఎక్కడన్నా కోటయ్య కనపడతాడా అంటే లేదు.

వెనక్కి తిరిగేరు.

గుళ్ళోకెళ్ళి పూజ చేయించుకొస్తున్న కళావంతుల భాస్కరం, కృష్ణవేణి ''ఎవరికోసమండీ ఆ వెతుకులాట?'' అన్నారు.

''కుమ్మరికోటయ్య కోసవమ్మా'' అన్నాడు మేస్త్రి వీరాస్వామి.



"లాకుల్లోపల మొండి మధ్య ఉన్న చింతచెట్ల దగ్గరకెళ్లి చూడండి" అని గుళ్ళో ప్రసాదం అందరికీ పెట్టి దిగువలో ఒంటరిగా ఉన్న వాళ్ళింట్లో కెళ్ళి పోయేరు.



గుంపంతా లాకుల లోపలికెళ్తుంటే లాకుల సూపర్నెంటుగారు విచిత్రంగా చూస్తున్నాడు.

నేలమీద ఎక్కడా ఎండపొడ అనేది లేకుండా నీడల్ని పరిచేసినియ్యా ఆ చింతచెట్లు. చిక్కటి ఆ కొమ్మల లోపల రకరకాల పక్షులు కిచకిచామని అరుస్తున్నాయి.

అంతలో కోటయ్యడోలు వినపడ్డంతో అంతా ఆపక్కకి నడిచేరు.

గోదావరికాలవ. ఆ కాలవ ఒడ్డున కట్టేసి ఉన్న గూటి పడవలో వయసులో ఉన్న పిల్ల కొబ్బరిసున్ని వండుతుంది. వాళ్ళు తిని కడక్కుండా మూల పడేసిన కుండల్లో ముక్కు లెట్టి పొడుస్తున్నాయి కాకులు. కాలవకి ఇటుపక్క ఒడ్డున పెద్ద చింత చెట్టు. దాని చల్లని నీడలో కూర్చున్న కోటయ్య ఈ లోకాన్ని మర్చిపోయి వాయిస్తున్నాడు డోలు.

చెట్లమీద ఉన్న పక్షులూ, గంటా గళాసు వీరాస్వామి మారేడుమిల్లి అడవుల్లోంచి తెచ్చి పెంచుకుంటున్న నెమలీ, ఆ చెట్ల మీద కాపురముండే చిలకలూ గోరింకలూ పావురాళ్ళు ఎలాంటి చప్పుడు చెయ్యకుండా కోటయ్య కచేరి వింటున్నాయి. గాలి నీరూ కూడా ఏ చప్పుడూ చెయ్యడం మానేసినియ్యి.

దగ్గరకొచ్చిన గుంపంతా కళ్ళు మూసుకుని వింటూ పసలపూడ్నుంచి ప్రయాణమయ్యి కాస్సేపట్లోనే ఏవో లోకాల్లోకి వెళ్ళి పోయారు.

* * *

కాలవగట్టు దగ్గర బస్సు దిగిన రాయవరం మున్సబుగారి తాలూకు మనిషి ఊళ్ళో కెళ్తుంటే జట్కా బండి నడిపే చిన్నం సత్తిరెడ్డి "బండిగట్టమంటారేంటండీ..... ఊళ్ళో ఎవరింటికో?" అన్నాడు.

"కుమ్మరికోటయ్య గారింటికి శ్రీరామనవమి పందిట్లో ప్రోగ్రాంకి పిలుద్దామని" అన్నాడు.

నవ్వేసిన సత్తిరెడ్డి "కోటయ్య ఇంట్లో ఎప్పుడు ఉండడండి" అన్నాడు.

"మరెక్కడుంటాడు?" అడిగాడు రాయవరం మున్సబుగారి మనిషి.

"ముందు జట్కా ఎక్కండి వెతుకుదాం" అన్నాడు చిన్నం సత్తిరెడ్డి.

జట్కా ఎక్కిన ఆ రాయవరం చౌదరిగారు "ఇదిగో ఏవయ్యా కోటయ్యని శ్రీరామనవమి పందిట్లో వాయించడానికి బుకింగు చేద్దావని వచ్చేను. దొరుకుతాడంటావా?" అన్నాడు.

"నాకు పెద్దగా తెల్దండి అడిగి చూడండి" అన్నాడు సత్తిరెడ్డి.

"ఈ కోటయ్యకి మాచవరంలో కర్రిసుబ్బిరెడ్డిగారు వెండికప్పు చదివించేరట నిజమేనా?" అడిగేడు చౌదరిగారు.

నవ్వేసిన సత్తిరెడ్డి "ఉట్టి వెండికప్పేగాదండి... బంగారపు గంటకూడా చదివించేరు... ఆరేగాదండి దుడ్డు సీతారావయ్యగారని ఆరు బంగారపు పతకాలతో సత్కారించేరు... ఈ చదివింపుల సంగతి పక్కన పెడదాం గానండి చౌదరిగారూ... తెనాలి అంకయ్యగారి గాత్రానికి మా కోటయ్య డోలు వాయించడం చూస్తే ఒళ్ళు తెల్దండి మనకి. అంత గొప్పోడండి మా కోటయ్యగారు... మర్చి పోయేనండోయ్ కోటిపిల్లి సూర్యప్రకాశరావు గారితో కలిసి చాలా కచేరీలు చేస్తుంటాడు కోటయ్యగారు. నిరుడేడు మావూరి సుబ్బారాయుడి షష్టికి కోటయ్యగారిడోలు షేక్ చినమౌలాలిగారి సన్నాయి కచేరి జరిగింది. ఈయనగార్ని చూడ్డానికి ఎక్కడెక్కడి నించో వస్తారండి జనం... అయితేనండి మా ఊరోళ్ళు మట్టుకి పెద్దగా పట్టించుకోరండి అతన్ని" అన్నాడు.

నవ్వేసిన రాయవరం చౌదరి "నిజమే మనూళ్ళో ఉన్నది మనకి పెద్దగా ఆనదు. ఇంతా ఎందుకూ ఈ పక్కనున్న ద్రాక్షారామం గుళ్ళోకి ఎక్కడెక్కడినించో దిగుతారు భక్తులు ఔనా?... మనం మట్టుకి ఎప్పుడూ లోపలికెళ్ళిన పాపాన పోలేదు...ఔనా కాదా?" అన్నాడు.

"చాలా కరెక్టుగా చెప్పేరండి తవరు" అన్నాడు సత్తిరెడ్డి.

"చాలా సంతోషంగానీ ఇలా ఎక్కడెక్కడో తిప్పుతున్నావ్ కోటయ్య ఉండటానికి ఇల్లు లేదా?" అన్నాడు.

''ఉందిగానండీ...ఆయనగారు డోలు సాధనంతా ఎక్కడెక్కడో చేస్తుంటాడండి. మేవంతా మా ఇల్లు మాది అనుకుంటావండి. కోటయ్యగారు మట్టుకి మా ఊరంతా నా ఇల్లు అనుకుంటాడండి మా వూరి చుట్టూరా ఉన్న వాతావరణమంతా నాదీ అనుకుంటాడండి. అందులో సాధన చేస్తాడండి'' అనేసి మళ్ళీ నవ్వేడు సత్తిరెడ్డి.

ద్వారంపూడి నరసారెడ్డిగారి సావిట్లోనూ, చింతావోరి తోటలోనూ, వంతెన దిగువనున్న నిదరగన్నేరు చెట్ల నీడల్లోనూ వెతుక్కుంటూ పోతుంటే చివరికి రామచంద్రపురం వెళ్ళే దారిలో పొలాల మధ్యలో ఉన్న వెంపర్తమ్మ గుడి పక్క గంగరాయి చెట్టు నీడలో కూర్చుని వాయిస్తున్నాడు కోటయ్య. చుట్టూ ఊళ్ళో రెడ్లపిల్లలూ, రకరకాల పిల్లలూ ఇలా ఒక కులంగాదు అన్ని కులాలవాళ్ళ పిల్లలూ కలగలిసి వింటున్నారు కోటయ్యకచేరి.

* * *

కుమ్మరికోటయ్య ఇల్లు చినెంకట్రాజు డాబా పక్కనే ఉంది. రెడ్ల ఇల్లులాగ పెద్దదే.

వాళ్ళ కుటుంబం మూడు వందల సంవత్సరాల్నుంచి డోలు వాయిస్తా, కళాసేవ చేస్తుంది. చదువుకొనే వయసులోనే వాళ్ల నాన్న డోలు వాయిస్తుంటే ఎంతో ఇష్టంగా, చూస్తా ఉండేవాడు. అది చూసిన కోటయ్య వాళ్ళ నాన్న, తన దగ్గరైతే కుర్రోడికి విద్య సరిగ్గా రాదని, తెనాలిలో

ఆమత్తూర్ బాలకోటయ్యగారి దగ్గర చేర్పించేడు.

ఆ తర్వాతగా తమిళనాడులో వీరాస్వామి పిళ్లైగారి దగ్గర కొంతకాలం నేర్చుకున్నాడు. కోటయ్య పంచెకట్టు, లాల్చీ, శిఖముడి, చెవులకు పోగులు, ముక్కులో కాడ, విభూతిరేకలు, కుంకుమ పెట్టుకుని వీధిలో నడుస్తుంటే, విద్వాంసుడి కళ ఉట్టి పడేది.

కుమ్మరికోటయ్య డోలు వాయించడంలో ఓ ప్రత్యేకత వుండేది. అదేంటంటే నట్టులు (వేళ్ళకి తగిలించుకునేవి) ఉపయోగించేవాడు కాదు. తన జీవిత కాలమంతా వొట్టి వేళ్ళతోనే వాయించాడు. అసలా రకంగా ఎవరూ వాయించరంట.

డోలు వాయిద్యంలో ఈయన ప్రత్యేకతను గుమనించి, కోటయ్య ప్రతిభకి పరీక్ష పెట్టారు. సుబ్రమణ్యశ్రేష్ఠి, పశ్చిమగోదావరి జిల్లాలోని చాగల్లులోకి దేశంలోని వందమంది డోలు విద్వాంసుల్ని పిల్చి పోటీని ఏర్పాటు చేస్తే, ఆ వందమంది కళాకారులు ఆశ్చర్యపోయ్యేట్టుగా డోలు ప్రదర్శన ఇచ్చేడు కోటయ్య.

డోలుతో పాటు కంజిర కూడా వాయించేవాడు కోటయ్య.

ఊళ్ళో పెదరెడ్డిగారూ రామచంద్రపురం రాజబాబుగారి తండ్రిగారయిన నరసరాజుగారూ మంచి స్నేహంగా ఉండేవారు.

ఒకరోజు రెడ్డిగారు కోటలో కెళ్ళినప్పుడు ''రేపు నా పుట్టినరోజు రెడ్డిగారూ రాత్రికి ఏ కార్యక్రమం పెడదావంటారు?'' అనడిగేడు నరసరాజుగారు.

పెదరెడ్డిగారు కోటయ్యగురించి చెప్పిన వెంటనే మొత్తం బృందాన్నే పిలిపించారు నరసరాజుగారు.

కచేరీ మొదలయ్యింది.

కాస్సేపయింతర్వాత చాలా చిరాకుపడ్డ నర్సరాజుగారు ''చస్ డోలు బాగోలేదు. దీన్ని ఆపేసి సన్నాయి మట్టుకే వాయించండి''అన్నారు.

దాంతో కోటయ్య మొకం ఇంతైపోవడం చూసిన పెదరెడ్డిగారు కోటయ్య చెవి దగ్గరకొచ్చి డోలు ఆపకుండా చిన్నగా వాయించమన్నారు.

ఆయన చెప్పినట్టే చేసేడు కోటయ్య.

కాసేపయ్యేక ''చస్ సన్నాయి బాగోలేదు. ఒట్టిడోలు మట్టుకే వాయించ''మన్నాడు నరసరాజుగారు.

రాజుగారు చెప్పినట్టే చేసిన కోటయ్య తనకొచ్చిన విద్యని ప్రదర్శించేసరికి ఉబ్బితబ్బిబ్బయిపోయిన నరసరాజుగారు వెయ్యిరూపాయలు బహుమానంగా ఇచ్చేరు.

* * *

ఆరోజు, పెద్దవీధిలో ఉన్న రాజేశ్వరస్వామి తీర్థం. ఆ మధ్య గాలిదుమ్ముకి తిరిగిపడిపోయిన ధ్వజస్తంభం తిరిగి నిలబెట్టే కార్యంకూడా ఆరోజే.

పునఃప్రతిష్ఠకి దేవదాయశాఖ మంత్రిగారొచ్చారు ఊళ్ళోకి. ఊరేగింపు జరుగుతుంది.

చుట్టుపక్కల ఊళ్ళనించి వచ్చిన జనంతో కిక్కిరిసిపోతుంది మాఊరు. ఓ పక్కన కొమరిపాలెం నించీ ద్రాక్షారామం నించీ తెచ్చిన మందుగుండు సామాను కాలుస్తున్నారు.

జనం అరుపులు కేకలు. మైకుసెట్లో పాటలు.

చాలా మామూలుగా నడుస్తున్న మంత్రిగారి చెవిన కోటయ్యడోలు వాయిద్యం పడ్డంతో ఆ పేలుడు సామాను మైకుల్లో పాటలూ ఆపెయ్యమన్న మంత్రిగారు కోటయ్య దగ్గరకొచ్చి ఆ డోలు వింటా మనలోకం మర్చిపోయేరు.

రాత్రి తీర్థం తీసుకునేప్పుడు కోటయ్యని పిలిపించి మళ్ళీ వాయించమన్నారు మంత్రిగారు.

మందుకన్నా కోటయ్యడోలు వాయిద్యం మంచి నిషానిచ్చింది మంత్రిగారికి.

''ఆస్థాన విద్వాంసుడి పదవి మీకిప్పిస్తాను. మీరు హైదరాబాదు వచ్చి తీరాలి కోటయ్యగారూ'' అన్నారు మంత్రిగారు.

నవ్విన కోటయ్య ఏటో చూస్తా ఉండిపోయేడు.

అది చూసిన మంత్రిగారు ''అదేంటి అలా నవ్వుతున్నారు మీరు హైదరాబాదు వచ్చి తీరాలి. ఏం రావడం ఇష్టం లేదా?'' అన్నారు.

మళ్ళీ నవ్వేడు కోటయ్య.

అదోరకంగా చూసిన మంత్రిగారు ''మీ నవ్వు వెనక అర్థమేంటో నాకు బోధ పడ్డం లేదు మీరొక్కరేగాదు మీతో పాటు మీ కుటుంబం మొత్తం రావచ్చు. మీకు చక్కని బంగ్లా అవీ ఏర్పాటు చేస్తుంది గవర్నమెంటు ఏవంటారు?'' అన్నారు.

మళ్ళీ నవ్విన కుమ్మరికోటయ్య ''అయ్యా నాదో విన్నపం'' అన్నాడు.

''ఏంటో చెప్పండి'' అన్నారు మంత్రిగారు.

హైదరాబాదు నేనూ నాకుటుంబంతో పాటు మా ఊరిలాకులూ అక్కడున్న నీడనిచ్చే చెట్లూ, మాగోదావరి కాలవా, పుంతరేవూ, వెంపర్తమ్మగుడీ, చింతావారి తోటా ఇవన్నీకూడా మాతో పాటు హైదరాబాదు తరలిస్తే తప్ప నేను రాలేనండీ... అవి లేకపోతే నేను లేనే లేనండీ'' అన్నాడు కుమ్మరికోటయ్య.

* * *